11-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - ఈ డ్రామా ఆట ఖచ్చితంగా జరుగుతూ ఉంది. ఎవరి పాత్ర ఏ క్షణము జరగాలో అదే మళ్లీ రిపీట్ అవుతూ ఉంది. ఈ విషయం యథార్థ రీతిగా అర్థము చేసుకోవాలి. "

**ప్రశ్న:-** పిల్లలైన మీ ప్రభావము ఎప్పుడు వెలువడ్తుంది ? ఇంతవరకు మీలో ఏ శక్తి లోపించి ఉంది ?

**జవాబు:-** యోగంలో గట్టి పడినప్పుడు మీ ప్రభావము వెలువడ్తుంది. ఆ పదును ఇంకా రాలేదు. స్మృతి ద్వారానే శక్తి లభిస్తుంది. జ్ఞాన ఖడ్గానికి స్మృతి అనే పదును అవసరము. ఆ పదును ఇంతవరకు తక్కువగా ఉంది. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేస్తూ ఉంటే నావ తీరానికి చేరుకుంటుంది. ఇది ఒక సెకెండు విషయమే.

**ఓంశాంతి.** ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు - ఆత్మల తండ్రి అని ఒక్కరిని మాత్రమే అంటారు. మిగిలినవారంతా ఆత్మలు. వారిని పరమ ఆత్మ అని అంటారు. తండ్రి అంటున్నారు - నేను కూడా ఆత్మనే, అయితే నేను పరమ(సుప్రీమ్) సత్యమును, నేనే పతితపావనుడను, జ్ఞానసాగరుడను. తండ్రి అంటున్నారు - నేను పిల్లలను విశ్వానికి యజమానులుగా చేసేందుకే భారతదేశములో వస్తాను. యజమానులుగా మీరే ఉండేవారు కదా. ఇప్పుడు స్మృతి కలిగింది. మీరు మొట్టమొదట సత్యయుగంలో వచ్చారు. తర్వాత పాత్రలను అభినయిస్తూ అభినయిస్తూ 84 జన్మలు అనుభవించి ఇప్పుడు చివరికి వచ్చేశారని పిల్లలకు స్మృతినిప్పించారు. మీరు స్వయాన్ని ఆత్మగా భావించండి. ఆత్మ అవినాశి, శరీరము వినాశనమయ్యేది. ఆత్మనే దేహములో ఉండి ఆత్మలతో మాట్లాడ్తుంది. ఆత్మాభిమానులుగా అయి ఉండకపోతే తప్పకుండా దేహాభిమానములో ఉన్నట్లే. నేను ఆత్మను అని అందరూ మర్చిపోయారు. పాపాత్మ, పుణ్యాత్మ, మహాత్మ అని కూడా అంటారు. ఆత్మ పరమాత్మగా అవ్వలేదు. ఎవ్వరూ స్వయాన్ని శివ అని చెప్పుకోలేరు. శరీరాలకైతే చాలామందికి శివుడనే పేరుంది. ఆత్మ శరీరములో ప్రవేశించినప్పుడు దానికి పేరు లభిస్తుంది ఎందుకంటే శరీరముతోనే పాత్రను అభినయించాల్సి ఉంటుంది. కనుక మనుష్యులు తప్పకుండా శరీర భావములోకి వచ్చేస్తారు. నేను ఫలానా అని అనుకుంటారు. ఇప్పుడు మీరు స్వయాన్ని ఆత్మనని, 84 జన్మల పాత్ర చేశానని అర్థము చేసుకున్నారు. ఇప్పుడు ఆత్మను గురించి మనము తెలుసుకున్నాము. ఆత్మలమైన మనము సతోప్రధానంగా ఉండేవారము. ఇప్పుడు మళ్లీ తమోప్రధానంగా అయ్యాము. ఆత్మలన్నింటి పై మైల(తుప్పు) ఏర్పడినప్పుడే తండ్రి వస్తారు. బంగారులో కల్తీ ఏర్పడ్తుంది కదా. మీరు మొట్టమొదట సత్యమైన బంగారుగా ఉండేవారు తర్వాత వెండి, రాగి, ఇనుము కల్తీగా పడి మీరు పూర్తిగా నలుపుగా అయిపోయారు. ఈ విషయాలు ఇతరులెవ్వరూ అర్థము చేయించలేరు. ఆత్మ నిర్లేపమని అందరూ అంటారు. కల్తీ ఎలా ఏర్పడ్తుందో కూడా పిల్లలైన మనకు తండ్రి అర్థము చేయించారు. నేను వచ్చేది భారతదేశములోనేనని తండ్రి చెప్తున్నారు. పూర్తిగా తమోప్రధానమైనప్పుడు నేను వస్తాను. ఖచ్చితమైన సమయానికి వస్తాను. డ్రామా ఖచ్చితంగా జరుగుతుంది కదా. ఏ పాత్ర ఏ క్షణము జరగాలో ఆ సమయములోనే రిపీట్ అవుతుంది. ఇందులో ఏ మాత్రము తేడా ఉండదు. అది హద్దులోని డ్రామా, ఇది అనంతమైన డ్రామా. ఇవన్నీ అర్థము చేసుకోవలసిన చాలా సూక్ష్మమైన విషయాలు. తండ్రి అంటున్నారు - మీ పాత్ర ఏదైతే నడిచిందో అదంతా డ్రామానుసారము జరిగింది. మనుష్యమాత్రులెవ్వరికీ రచయిత, రచనల ఆది, మధ్య, అంత్యముల గురించి తెలియదు. ఋషులు, మునులు కూడా నేతి - నేతి(తెలియదు - తెలియదు) అంటూ వెళ్లిపోయారు. ఇప్పుడు ఎవరైనా మిమ్ములను రచయిత, రచనల ఆదిమధ్యాంతాలు తెలుసునా? అని అడిగితే మీరు వెంటనే,

మాకు తెలుసు అని చెప్తారు. ఇది కూడా ఇప్పుడు మాత్రమే తెలుసుకున్నారు. తర్వాత ఎప్పుడూ తెలుసుకోలేరు. బాబా తెలియజేశారు – ఇప్పుడు మీరే రచయిత అయిన నన్ను, నా రచన ఆదిమధ్యాంతాలను తెలుసుకున్నారు. ఈ లక్ష్మీనారాయణుల రాజ్యము ఎప్పుడు వస్తుందో వీరికి తెలిసే ఉంటుంది అంటారు. కానీ వీరికి తెలియదు. వీరికి జ్ఞానము లేదు. ఇది విచిత్రమైన విషయము. మాకు జ్ఞానముందని మీరంటారు. తండ్రి పాత్ర ఒక్కసారి మాత్రమే ఉంటుందని మీకు తెలుసు. మీ లక్ష్యము – లక్ష్మీనారాయణులుగా అవ్వడం. అయిన తర్వాత చదువుకునే అవసరమే ఉండదు. బ్యారిస్టరుగా అయ్యాక మళ్లీ చదవరు కదా. చదివించే తండ్రిని స్మృతి చేయాలి కదా. మనకు బాబా అన్నీ సులభము చేసి ఇచ్చారు. బాబా మాటి మాటికి చెప్తున్నారు – మొదట స్వయాన్ని ఆత్మగా భావించండి. నేను బాబా పుత్రుడను అని తెలుసుకోండి. మొదట మీరు నాస్తికులుగా ఉండేవారు, ఇప్పుడు ఆస్తికులుగా అయ్యారు. ఈ లక్ష్మీనారాయణులు కూడా ఆస్తికులుగా అయ్యే ఈ వారసత్వాన్ని తీసుకున్నారు. దానినిప్పుడు మీరు తీసుకుంటున్నారు. ఇప్పుడు మీరు ఆస్తికులుగా అవుతున్నారు. ఆస్తికులు, నాస్తికులు అనే పదాలు ఈ సమయానికి చెందినవే. అక్కడ ఈ పదాలే ఉండవు. ఇలా అడిగే అవసరమే ఉండదు. ఇక్కడ ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి. అందుకే రచయిత, రచనల గురించి తెలుసా? అని అడుగుతారు. అప్పుడు వారు తెలియదని చెప్తారు. తండ్రే వచ్చి తన పరిచయాన్నిస్తారు. అంతేకాక రచన ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు. తండ్రి అనంతమైన మాలికులు. వారే రచయిత. ఇతర ధర్మస్థాపకులు కూడా ఇక్కడకు తప్పకుండా వస్తారు. ఇబ్రహీమ్, ఏసుక్రీస్తు మొదలైన వారు ఇక్కడకు ఎలా వస్తారో సాక్షాత్కారము చేయించారు. చివర్లో చాలా ప్రసిద్ధి చెందినప్పుడు వారు వస్తారు. తండ్రి అంటున్నారు – పిల్లలూ, దేహ సహితం దేహ ధర్మాలన్నీ త్యాగము చేసి నన్ను స్మృతి చేయండి. ఇప్పుడు మీరు సన్ముఖములో కూర్చొని ఉన్నారు. స్వయాన్ని దేహమని భావించరాదు. నేను ఒక ఆత్మను అని భావించాలి. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేస్తూ ఉంటే నావ తీరానికి చేరుకుంటుంది. ఒక్క సెకండు విషయమే. ముక్తిధామానికి వెళ్లేందుకే అర్ధకల్పము భక్తి చేస్తారు. కాని ఏ ఒక్క ఆత్మ కూడా వాపస్ వెళ్లలేదు.

5 వేల సంవత్సరాల క్రితము కూడా తండ్రి ఈ విషయాలు అర్థం చేయించారు, ఇప్పుడు కూడా అర్థం చేయిస్తున్నారు. శ్రీకృష్ణుడు ఈ విషయాలను అర్థం చేయించలేరు. అతనిని తండ్రి అని కూడా అనరు. లౌకిక, అలౌకిక, పారలౌకిక తండ్రులున్నారు. హద్దు తండ్రి లౌకికము. ఆత్మల తండ్రి అనంతమైన పారలౌకిక తండ్రి. ఇతను సంగమయుగములోని అద్భుతమైన తండ్రి. ఇతనిని అలౌకిక తండ్రి అని అంటారు. ప్రజాపిత బ్రహ్మను ఎవ్వరూ స్మృతి చేయరు. అతను మన గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్. ఇది బుద్ధిలోకి రాదు. ఆదిదేవుడు ఆడమ్.......అని అంటారు. కాని కేవలము మాట వరుసకు అంటారు. మందిరంలో కూడా ఆదిదేవుని చిత్రముంది కదా. మీరు అక్కడకు వెళ్తే ఇది మా స్మృతిచిహ్నమే అని భావిస్తారు. బాబాతో పాటు మనము కూడా కూర్చొని ఉన్నాము. ఇక్కడ తండ్రి చైతన్యంగా కూర్చొని ఉన్నారు. అక్కడ జడ చిత్రముంది. పై భాగాన స్వర్గము కూడా సరిగ్గా ఉంది. మందిరాన్ని చూచినవారు ఇప్పుడు బాబా మాకు చైతన్యములో రాజయోగము నేర్పిస్తున్నారని తెలుసుకుంటారు. ఆ తర్వాత మందిరాన్ని నిర్మిస్తారు. ఇవన్నీ మా జ్ఞాపకచిహ్నాలని స్మృతిలోకి రావాలి. ఈ లక్ష్మీనారాయణులుగా ఇప్పుడు మనము అవుతూ ఉన్నాము. ఒకప్పుడు అలా ఉన్నాము తర్వాత మెట్లు దిగుతూ వచ్చాము. ఇప్పుడు మనమంతా ఇంటికి వెళ్లి మళ్లీ రాజ్యములోకి వస్తాము. చివర్లో రావణ రాజ్యము వస్తుంది. మళ్లీ మనము వామమార్గములోకి వెళ్ళిపోతాము. తండ్రి ఎంతో బాగా వివరంగా అర్థం చేయిస్తున్నారు. ఇప్పుడు మనుష్యమాత్రులందరూ పతితులుగా ఉన్నారు. అందుకే పతితపావనా! వచ్చి మమ్ములను పావనంగా చేయమని పిలుస్తున్నారు. దు:ఖమును హరించి సుఖానికి దారి చూపండి అని అంటారు. భగవంతుడు తప్పకుండా ఏదో ఒక

వేషములో వస్తాడని కూడా అంటారు. కుక్కలో, పిల్లిలో, రాయి రప్పలలో మెదలైనవాటిలో రారు. భాగ్యశాలి రథములో వస్తాడని మహిమ కూడా ఉంది. తండ్రి స్వయంగా చెప్తున్నారు - నేను సాధారణ శరీరములోనే ప్రవేశిస్తాను. ఇతనికి తన గత జన్మల గురించి తెలియదు. ఇప్పుడు మీకు తెలుసు. ఇతని అనేక జన్మల అంతిమ జన్మలో, అంతిమ సమయంలో, వానప్రస్థ అవస్థ వచ్చినప్పుడు నేను ఇతనిలో ప్రవేశిస్తానని అంటారు. భక్తిమార్గములో పాండవుల చిత్రాలను చాలా పెద్దవిగా తయారుచేశారు. రంగూన్‌లో బుద్ధుని చిత్రము కూడా చాలా పెద్దదిగా ఉంది. ఇంత పెద్దగా ఏ మనిషీ ఉండడు. పిల్లలకు ఇప్పుడు నవ్వు వస్తూ ఉంటుంది. రావణుని చిత్రమునెలా తయారు చేశారో చూడండి. రోజురోజుకూ పెద్దదిగా చేస్తూనే ఉంటారు. ప్రతి సంవత్సరము తగులబెట్టే ఈ వస్తువేది? ఇటువంటి శత్రువు ఎవరైనా ఉంటారా? శత్రువుల చిత్రమే తయారు చేసి తగులబెడ్తూ ఉంటారు. మంచిది. అయితే రావణుడంటే ఎవరు? మనకు శత్రువుగా ఎప్పుడయ్యాడు? ప్రతి సంవత్సరము తగులబెడ్తూనే ఉంటారు. ఈ శత్రువును గురించి ఎవ్వరికీ తెలియదు. దీని అర్థము ఏమిటో ఏ మాత్రమూ తెలియదు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - వారు రావణ సంప్రదాయానికి చెందినవారు. మీరు రాముని సంప్రదాయము వారు. ఇప్పుడు తండ్రి అంటున్నారు - గృహస్థ వ్యవహారములో ఉంటూ కమలపుష్ప సమానంగా అవ్వండి, నన్ను స్మృతి చేస్తూ ఉండండి. " హంసలు, కొంగలు కలిసి ఎలా ఉంటారు బాబా " అని అంటారు. సంఘర్షణ జరుగుతూ ఉంటుంది. అలా జరిగేదే. మీరు సహించవలసి ఉంటుంది. అందుకు చాలా యుక్తులు కూడా ఉన్నాయి. బాబాను రంజూరమజ్ బాజ్ అని అంటారు. అందరూ వారినే స్మృతి చేస్తుంటారు కదా - ఓ భగవంతుడా! దు:ఖమును హరించండి, దయ చూపండి, ముక్తినివ్వండి. ఆ ముక్తిదాత(లిబరేటర్) అయిన తండ్రి అందరికీ ఒక్కరే, మీ వద్దకు ఎవరైనా వస్తే వారికి విడివిడిగా కూర్చుని అర్థం చేయించండి. కరాచీలో ఒక్కొక్కరికి విడివిడిగా కూర్చొని అర్థము చేయించేవారు.

పిల్లలైన మీరు యోగములో శక్తివంతమైతే మీ ప్రభావము వెలువడ్తుంది. ఇప్పుడింకా ఆ శక్తి (పదును)లేదు. స్మృతి ద్వారానే శక్తి లభిస్తుంది. చదువు ద్వారా శక్తి లభించదు. జ్ఞానమనేది ఖడ్గము. అందులో స్మృతి అనే పదును నింపాలి. ఆ శక్తి తక్కువగా ఉంది. తండ్రి ప్రతి రోజూ చెప్తూనే ఉన్నారు. పిల్లలూ, స్మృతి యాత్రలో ఉంటే మీకు శక్తి లభిస్తుంది. చదువులో ఇంత శక్తి ఉండదు. స్మృతి ద్వారా మీరు విశ్వమంతటికీ యజమానులుగా అవుతారు. మీరు చేసేదంతా మీ కొరకే. చాలామంది వచ్చారు. మళ్ళీ వెళ్ళిపోయారు. మాయ కూడా చాలా శక్తివంతమైనది (జయించనలవి కానిది). చాలామంది ఇలా అంటారు - ఇక్కడ జ్ఞానమేమో చాలా బాగుంది, ఖుషీ కూడా కలుగుతుంది. బయటకు వస్తూనే సమాప్తం. కొంచెము కూడా ఖుషీని నిలువనివ్వదు. కొంతమందికి చాలా సంతోషం కలుగుతుంది - ఓహో! ఇప్పుడు బాబా వచ్చారు. మనము మన సుఖధామానికి వెళ్తాము. తండ్రి అంటున్నారు - ఇప్పుడింకా రాజధాని పూర్తిగా ఎక్కడ స్థాపనయింది? ఈ సమయంలో ఈశ్వరీయ సంతానమైన మీరే మళ్ళీ దేవతలుగా అవుతారు. డిగ్రీ తగ్గిపోయింది కదా. మీటరులో పాయింట్లు ఉంటాయి. ఇన్ని పాయింట్లు తక్కువ అని తెలుపుతుంది. ఇప్పుడు మీరు ఒక్కసారిగా ఉన్నతమవుతారు. ఆ తర్వాత తగ్గుతూ తగ్గుతూ క్రిందకు వచ్చేస్తారు. మెట్లు కిందకు దిగే తీరాలి. ఇప్పుడు మీ బుద్ధిలో మెట్ల చిత్రము యొక్క జ్ఞానముంది. ఉన్నతమయ్యే కళ అందరికీ మంచిది(చడ్‌తీ కళా సర్వకా భళా). తర్వాత మెల్లమెల్లగా కళలు క్రిందకు దిగుతాయి. ప్రారంభము నుండి ఈ చక్రాన్ని బాగా అర్థము చేసుకోవాలి. ఇప్పుడు మీది ఉన్నతమయ్యే కళ ఎందుకంటే తండ్రి జతలో ఉన్నారు కదా. మానవులు ఏ ఈశ్వరుని సర్వవ్యాపి అని అంటారో ఆ ఈశ్వరుడు ఇప్పుడు మధురాతి మధురమైన పిల్లలూ, పిల్లలూ! అని అంటున్నారు. పిల్లలు కూడా బాబా - బాబా అని అంటారు. బాబా మనలను చదివించేందుకు వచ్చారు. ఆత్మ చదువుకుంటుంది. ఆత్మనే కర్మలాచరిస్తుంది. ఆత్మలైన మనము శాంతి స్వరూపులము. ఈ

శరీరము ద్వారా కర్మ చేస్తున్నాము. అశాంతి అను పదము ఎప్పుడంటారు? దు:ఖము కలిగినప్పుడు. పోతే శాంతి మన స్వధర్మము. చాలామంది మన:శ్శాంతి కావాలని అంటారు. అరే! ఆత్మ స్వయంగా శాంతి స్వరూపము. ఆత్మల ఇల్లే శాంతిధామము. మీరు స్వయాన్ని మర్చిపోయారు. మీరు శాంతిధామంలో నివసించేవారు. శాంతి అక్కడ మాత్రమే లభిస్తుంది. ఈ రోజులలో అందరూ ఒకే రాజ్యము, ఒకే భాష ఉండాలని అంటారు. ఒకే కులము, ఒకే మతము, ఒకే దేవుడని అంటారు. ఇప్పుడు ప్రభుత్వము కూడా ఒకే దేవుడని వ్రాస్తూ ఉంది. మళ్ళీ సర్వవ్యాపి అని ఎందుకంటారు? ఒకే దేవుని ఎందుకు అంగీకరించడం లేదు. మీరు లక్ష్మీనారాయణుల చిత్రాన్ని తయారుచేస్తారు. పైన ఇలా వ్రాయండి - సత్యయుగములో వీరి రాజ్యమున్నప్పుడు, ఒకే దేవీదేవతా ధర్మముండేది. కాని మనుష్యులు ఏ మాత్రమూ అర్థము చేసుకోరు. గమనమివ్వరు. మన బ్రాహ్మణ కులానికి చెందిన వారికి గమనముంటుంది. ఇతరులెవ్వరికీ అర్థమవ్వదు. అందుకే బాబా అంటున్నారు - వేరువేరుగా కూర్చుండబెట్టిన తర్వాత అర్థము చేయించండి. ఫారం నింపిస్తే తెలుస్తుంది ఎందుకంటే ఒక్కొక్కరు ఒక్కొక్కరిని అంగీకరిస్తారు. అందరినీ కలిపి ఎలా తెలిపిస్తారు? వారి వారి మాటలు వినిపించేందుకు ప్రారంభిస్తారు. మొట్టమొదట మీరు ఎక్కడకు వచ్చారని అడగాలి. బి.కె. పేరు విన్నారా? అని అడగాలి. ప్రజాపిత బ్రహ్మ మీకు ఏమవుతారు? ఎక్కడైనా పేరు విన్నారా? మీరు ప్రజాపిత బ్రహ్మ సంతానము కాదు! మేము ప్రాక్టికల్‌గా వారి సంతానము. మీరు కూడా వారి సంతానమే, కాని మీకు అర్థము కాలేదు అని నెమ్మదిగా తెలియచేయాలి. తెలియచేసేందుకు చాలా యుక్తి కావాలి. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. మందిరాలు మొదలైన వాటిని చూస్తూ ఇవన్నీ మా స్మృతిచిహ్నాలే అని సదా గుర్తుండాలి. ఇప్పుడు మళ్లీ మేము ఈ విధంగా లక్ష్మీనారాయణులుగా అవుతున్నాము అనే సంతోషములో ఉండాలి.
2. గృహస్థ వ్యవహారములో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉండాలి. హంసలు, కొంగలు ఒకే చోట కలిసి ఉన్నప్పుడు చాలా యుక్తిగా నడుచుకోవాలి. సహించాలి కూడా.

## వరదానము :- "మాయ బంధనాల నుండి సదా నిర్బంధనులుగా ఉండే యోగయుక్త్, బంధనముక్త్ భవ"

బంధనముక్తుల గుర్తు సదా యోగయుక్తంగా ఉండడం. యోగయుక్తంగా ఉండే పిల్లలు బాధ్యతల బంధనము లేక మాయ బంధనాల నుండి ముక్తులుగా ఉంటారు. మానసిక బంధనాలు కూడా ఉండరాదు. లౌకిక బాధ్యతలైతే ఆట వంటివి కనుక డైరక్షన్ అనుసారం ఆట వలె నవ్వుతూ ఆడితే ఎప్పుడూ చిన్న చిన్న విషయాలకు అలసిపోరు. అవి బంధనాలుగా భావిస్తే టెన్షన్‌లోకి వస్తారు (విసిగిపోతారు). ఏమిటి, ఎందుకు అనే ప్రశ్నలు తలెత్తుతాయి. కాని బాధ్యత తండ్రిది, మీరు నిమిత్తులు - ఈ స్మృతి ద్వారా బంధనముక్తులుగా అవుతే యోగయుక్తంగా అవుతారు.

## స్లోగన్ :- " చేసి చేయించేవారి స్మృతి ద్వారా భావాన్ని, అభిమానాన్ని సమాప్తం చేయండి. "